నమస్తే తెలంగాణ
# ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ గురువారం 23 జనవరి 2025 | ADILABAD NIRMAL

## గ్రామ సభల్లో రచ్చ రచ్చ..

- నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని బన్సపెల్లి, మామడ మండలం న్యూలింగంపెల్లిలో లబ్ధిదారుల ఎంపికలో లోటు పాట్లు ఉన్నాయంటూ జనాలు అధికారులను నిలదీశారు. ఏ ప్రతిపాదిక ఎంపిక చేశారో చెప్పాలని, పేదలమైన మా పేర్లు ఎందుకు జాబితాలో రాలేదని గొడవకు దిగారు.
- నిర్మల్ మండలంలోని అక్కాపూర్ లబ్ధిదారుల జాబితాలో మా పేర్లు లేవని, లబ్ధిదారుల జాబితాలను చింపేయాలని నిరసన తెలిపారు.
- ముథోల్ మండలంలోని తరోడాలో అర్హుల పేర్లు రేషన్ కార్డు జాబితాలో రాలేవని అసంతృప్తి వ్యక్తం నిరసన తెలిపారు. తహసీల్దార్ శ్రీకాంత్ గ్రామసభకు చేరుకుని అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు వచ్చేలా చూస్తామని హామీ ఇవ్వడం ప్రజలు శాంతించారు.




దిలావర్‌పూర్ మండలంలోని బన్సపల్లి గ్రామ సభలో రేషన్‌కార్డుల జాబితాను చదివి వినిపిస్తుండగా అర్హులకు రేషన్‌కార్డులు రాలేవని రెవెన్యూ అధికారులను నిలదీస్తున్న యువకులు



తాంసి : గోట్కూరి గ్రామసభలో అధికారులకు వినతిపత్రాలు అందిస్తున్న గ్రామస్తులు



ఉట్నూర్ రూరల్ : గ్రామసభలో అధికారులతో వాగ్వివాదానికి దిగిన నాయకులు



సోన్ : రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించాలని అధికారికి విన్నవిస్తున్న గ్రామస్తురాలు



బోథ్ : గ్రామసభలో కాంగ్రెస్ నాయకులతో వాగ్వాదానికి దిగిన బీఆర్ఎస్ నాయకులు

# మర్లవడ్డ జనం

**కోతలు.. కొర్రీలు..**

- రెండో రోజూ ప్రజాపాలన గ్రామసభల్లో కొనసాగిన నిరసనలు, ఆందోళనలు
- పోలీసుల పహార మధ్య సభల నిర్వహణ
- తూతూ మంత్రంగా నిర్వహించడంపై జనం మండిపాటు
- నిర్మల్ జిల్లా అక్కాపూర్‌లో లబ్ధిదారుల జాబితా చింపేయాలని నిరసన

**లబ్ధిదారుల ఎంపికలో లోటు పాట్లు..** **అర్హుల పేర్లు లేకపోవడంపై నిలదీత..**

*ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న గ్రామసభలు రెండో రోజైన బుధవారం యుద్ధ భూములను తలపించాయి. లబ్ధిదారుల ఎంపికలో లోటుపాట్లు ఉన్నాయంటూ.. అర్హుల పేర్లు జాబితాల్లో లేవంటూ జనం తిరగబడ్డారు. అర్హుల పేర్లు లేకుండా అధికార పార్టీ చెప్పినోళ్ల పేర్లతో జాబితాలు సిద్ధం చేశారా? అంటూ ప్రశ్నించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా పలు గ్రామ, వార్డు సభల్లో రెండో రోజైన బుధవారం నిరసనలు, నిలదీతలు, ఆందోళనలు కొనసాగాయి.*

*- మంచిర్యాల, జనవరి 22(నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

- ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం సుంకిడిలో అర్హులైన వారికి రేషన్ కార్డులు మంజూరు కాలేదంటూ గ్రామసభలో స్థానికులు ఆందోళన చేశారు.
- ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం షాంపూర్‌లో అర్హుల కోసం రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇల్లు రాలేదంటూ స్థానికులు నిరసన తెలిపారు.
- ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నది. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వలేదని, ఇండ్లు కట్టివ్వలేదని కాంగ్రెస్ నాయకులు అనడంతో బీఆర్ఎస్ నాయకులు వాగ్వాదానికి దిగారు.
- ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలోని సీతాగోంది, మన్నూర్, గర్కంపేట్, శంభుగూడ, ముత్నూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన బ్యానర్‌పై ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఫొటో లేకపోవడంతో బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్లీ ఇటువంటి పొరపాట్లు జరగకుండా చూస్తామని అధికారులు చెప్పడంతో శాంతించారు.
- ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని గోముత్రి గ్రామసభలో రుణమాఫీ కాకపోవడంపై రైతులు అసహనం వ్యక్తం జేశారు. కాగా.. గ్రామసభల ఫ్లెక్సీలపై ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఫొటో లేకపోవడంపై సర్వత్రా నిరసన వ్యక్తం అవుతున్నది.
- ఆదిలాబాద్ జిల్లా నేరెడిగొండ మండలంలో నిర్వహించిన గ్రామసభలు పోలీసు పహారా మధ్య కొనసాగాయి. ఎన్నడూ లేని విధంగా పోలీసులు గ్రామసభల వద్ద ఉండడం విమర్శలకు తావిస్తున్నది.
- ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి గ్రామ పంచాయతీలో నిర్వహించిన గ్రామసభలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో పోలీసులు నిలువరించారు.
- ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని గోట్కూరి గ్రామంలో ప్రజాపాలన గ్రామసభ నిర్వహించగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఒక్కరిని మాత్రమే ఎంపిక చేశారని అసలైన అర్హులను గుర్తుంచలేదని గ్రామస్తులు అధికారులతో వాపోయారు.



తాంసి : గ్రామసభను బహిష్కరించి నిరసన తెలుపుతున్న వడ్డాడి గ్రామస్తులు



తలమడుగు : సుంకిడిలో అధికారులతో వాగ్వాదానికి దిగిన బీఆర్ఎస్ నాయకులు



నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలో నిర్వహించిన గ్రామసభలో ప్రజలను సముదాయిస్తున్న తహసీల్దార్ శ్రీకాంత్




ఇంద్రవెల్లి : వాగ్వివాదానికి దిగిన కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు

## మాకేం తెల్వదు.. లిస్ట్ మంత్రి వద్దే
# ఫైనల్ అవుతుంది

**వడ్డాడి గ్రామ సభలో వెల్లడించిన ఎంపీవో**

- లబ్ధిదారుల జాబితాపై గ్రామస్తుల ఆగ్రహం
- గ్రామసభ బహిష్కరించిన గ్రామస్తులు



వడ్డాడి గ్రామసభలో అధికారులను ప్రశ్నిస్తున్న మాజీ సర్పంచ్ బొల్లి శ్రీనివాస్

తాంసి, జనవరి 22 : వడ్డాడి గ్రామంలో బుధవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభ గందరగోళం మధ్య రసాభాసగా సాగింది. అర్హులను గుర్తించి నిరుపేదలకు న్యాయం చేయాలని అధికారులపై గ్రామస్తులు, ఉపాధి కూలీలు మండిపడ్డారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అర్హుల జాబితా ఎవరు తయారు చేశారని అధికారులను ప్రశ్నించారు. సంబంధిత అధికారి మాట్లాడుతూ.. మాకేం తెలవదు ఈ లిస్టు తయారు చేసి జిల్లా అధికారులకు ఇస్తాం, వారు మన ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు ఇస్తే అక్కడే తయారు అవుతుంది. అక్కడి నుంచి వచ్చిన లిస్టుని గ్రామసభల్లో చదువుతున్నామని బహిరంగ సభలో ఎంపీవో లింగయ్య తెలుపడంతో గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. ఇంకెందుకు గ్రామ సభలు పేడతారని, అదేవిధంగా అనర్హుల లబ్ధిదారుల జాబితాను తయారు చేసి నిరుపేదల పొట్టకొట్టాలని ఎద్దేవా చేశారు. కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా అసలైన లబ్ధిదారులకు చోటు దక్కలేదని గ్రామస్తులు ఇదేం పద్ధతిని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో 300 మందికి పైగా ఉపాధి హామీ వ్యవసాయ కూలీలు ఉంటే అందులో 33 మందికి మాత్రమే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా జాబితాలో పేర్లు వచ్చాయని ఆరోపించారు. వచ్చిన వారిలో కూడా ఎకరానికి పైగా భూమి ఉన్న అనేక మంది పేర్లు ఉన్నాయని మండిపడ్డారు. అధికారులకు గ్రామస్తులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అధికారులు పద్ధతి మార్చుకోవాలని ఇదేం పద్ధతని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామసభలు ఎందుకు పేడతారని అధికారులను ప్రశ్నించారు. ఇదేమి రాజ్యం ఇదేమి రాజ్యం దోపిడి రాజ్యం దొంగల రాజ్యం అంటూ నినాదాలు చేశారు. ప్రజా పాలన గ్రామసభను బహిష్కరిస్తున్నట్లు మాజీ సర్పంచ్ బొల్లి సౌందర్య శ్రీనివాస్, నాయకులు భూమన్న, మహేందర్ అన్నారు.

### వడ్డాడి గ్రామసభను పరిశీలించిన డీఎస్పీ

మండలంలో అధికారులు చేపట్టిన ప్రజా పాలన గ్రామసభలు పోలీసుల బందోబస్తు నడుమ కొనసాగుతున్నాయి. బుధవారం వడ్డాడి గ్రామంలో చేపట్టిన ప్రజా పాలనలో అర్హులైన లబ్ధిదారుల పేర్లు లేవని గ్రామస్తులు అధికారులతో వాగ్వాదానికి దిగడంతో తాంసి ఎస్సై రాధిక మండల పోలీసులతో రంగంలోకి దిగి వారికి సర్ది చెప్పారు. అనంతరం డీఎస్పీ జీవన్ రెడ్డి ప్రజాపాలన గ్రామసభను పరిశీలించారు. జిల్లాలో ప్రజా పాలన గ్రామసభల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. వారి వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

### భూమిలేని కూలీలకు ఆత్మీయ భరోసా ఇవ్వాలి



*రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పనుల్లో 2024 - 25 సంవత్సరంలో 20 రోజులు పని చేసిన వారి పేర్లను మాత్రమే లబ్ధిదారుల జాబితాలో చేర్చడం సరైన పద్ధతి కాదు. మా ఊరిలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో 10 శాతం మందికి రాగా అర్హులైన వారి పేర్లు జాబితాలో రాలేవు. అసలు భూమిలేని నిరుపేద కూలీలను గుర్తించి రూ.12వేలు ఆర్థిక సాయం అందించకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం.*

***-సిరిగిరి మహేందర్, రైతు, వడ్డాడి***

## రెండు రోజులు.. 23,944 దరఖాస్తులు

- ఆదిలాబాద్ మున్సిపాలిటీలో మరో ఐదు వేల వరకు..
- అర్హుల ఎంపికపై గందరగోళం
- లబ్ధిదారుల ఎంపికపై సందిగ్ధత

ఆదిలాబాద్, జనవరి 22(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ మున్సిపాలిటీలోని ఆరో వార్డులో రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా లబ్ధిదారుల ఎంపిక అస్తవ్యస్తంగా మారింది. ఏడాది కిందట ప్రజలు ఈ పథకాల కోసం ప్రజాపాలనలో దరఖాస్తులు అందజేశారు. దీంతోపాటు ఇటీవల నిర్వహించిన కులగణన సర్వేకు వచ్చిన సిబ్బందికి తమ వివరాలను తెలియజేశారు. లబ్ధిదారుల ఎంపికలో భాగంగా నిర్వహించిన క్షేత్రస్థాయి పరిశీలనలో కూడా ఫొటోలు దిగడంతోపాటు అధికారులు అడిగిన పత్రాలను అందజేశారు. ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, వ్యవసాయ కూలీలకు అందించే ఆత్మీయ భరోసా పథకాలు వస్తాయనే ఆశతో ఉన్న వారికి నిరాశే ఎదురైంది.

### దరఖాస్తుల వెల్లువ

ప్రజాపాలనలో భాగంగా ఆదిలాబాద్ మున్సిపాలిటీతోపాటు గ్రామాల్లో రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లకు వందల సంఖ్యలో ప్రజలు దరఖాస్తు చేసుకోగా లబ్ధిదారుల సంఖ్య రెండు అంకెలు దాటకపోవడంతో అర్హులు ఆందోళన చెందుతున్నారు. రేషన్‌కార్డులు, ఇండ్లు, ఆత్మీయ భరోసా జాబితాల్లో తమ పేర్లు ఎందుకు రాలేదని అధికారులు అడుగుతున్నారు. అర్హులు, లబ్ధిదారుల జాబితా ప్రభుత్వం నుంచి వచ్చిందని తాము ఏమీ చేయలేమని అధికారులు సమాధానం ఇస్తున్నారు. మరోసారి దరఖాస్తు ఇవ్వాలని సూచిస్తున్నారు. దిక్కుతోచని పరిస్థితుల్లో పేదలు మరోసారి దరఖాస్తులు ఇస్తున్నారు. దీంతో వార్డు గ్రామసభల్లో జిల్లావ్యాప్తంగా రెండ్రోజులుగా భారీ సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. జిల్లాలోని రెండ్రోజులుగా నిర్వహిస్తున్న గ్రామసభల్లో గ్రామీణ మండలాల నుంచి 23,944 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో రేషన్ కార్డుల కోసం 14,019, ఇందిరమ్మ ఇండ్ల కోసం 5,359, ఆత్మీయ భరోసా కోసం 4,528, రైతు భరోసా కోసం 38 దరఖాస్తులు వచ్చాయి. ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 49 వార్డులు ఉండగా ఇప్పటి వరకు నిర్వహించిన వార్డు సభల్లో మరో ఐదు వేల వరకు దరఖాస్తులు వచ్చి ఉంటాయని అంచనా.

### రసీదులు ఇవ్వడం లేదు..

రెండ్రోజులుగా జిల్లాలో నిర్వహిస్తున్న వార్డు, గ్రామసభల్లో నాలుగు పథకాల కోసం ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్న వారికి ఎలాంటి రసీదులు ఇవ్వకపోవడం లేదు. దీంతో తాము దరఖాస్తు ఇచ్చినట్లు రుజువు ఏమిటని జనం ప్రశ్నిస్తున్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు ఇస్తే రసీదులు ఇచ్చినా రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు రాలేదని, ఇప్పుడు వస్తాయని నమ్మకం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బుధవారం పట్టణంలోని 35 వార్డు సభకు హాజరైన స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ దరఖాస్తుదారులకు రసీదులు ఎందుకు ఇవ్వడం లేదని, కలెక్టర్‌తో ఈ విషయం మాట్లాడుతామని అన్నారు.



పట్టణంలోని కైలాస్‌నగర్ వార్డుసభలో దరఖాస్తులు ఇవ్వడానికి వచ్చిన జనం

### లబ్ధిదారుల ఎంపికలో సందిగ్ధత

లబ్ధిదారుల ఎంపికలో భాగంగా అర్హుల జాబితాను వార్డు, గ్రామసభల్లో ప్రదర్శిస్తున్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని అధికారులు కోరుతున్నారు. జనం జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. అసలు విషయం పట్టించుకోవడం లేదు. దీంతో ఎక్కువ అభ్యంతరాలు వ్యక్తం కావడం లేదు. రేషన్‌కార్డుల జాబితాలో అర్హులు, అనర్హులను ప్రకటించగా, ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో అర్హుల పేర్లు మాత్రమే ఉన్నారు. వారిలో ఎవరికి ఇండ్లు వస్తాయనే స్పష్టత లేదు. సొంత జాగా ఉన్నా పక్కా ఇండ్లు లేని వారి జాబితాతో పాటు అద్దెకు ఉంటున్న వారి వివరాలు మాత్రమే ఉంటున్నాయి. ఈ జాబితాను చూసుకుంటున్న జనం తమకు ఇళ్లు మంజూరైందని అనుకుంటున్నారు. ఇండ్ల మంజూరు విషయంలో అధికారులను అడిగితే ప్రభుత్వం ఆయా నియోజకవర్గాలకు మంజూరు చేసి ఇండ్లకు అనుగుణంగా అర్హులకు ఇండ్లు మంజూరవుతాయని అంటున్నారు.